క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు.

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ఓంకారంలో కొలువైన శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామి వారికి మంగళవారం బహుళ త్రయోదశి పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు.

బాల కార్మికులకు విముక్తి కల్పించాలి



మాట్లాడుతున్న జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: దుకాణాల్లో, హోటళ్లలో పని చేస్తున్న బాల కార్మికులకు విముక్తి కల్పించాలని సివిల్ సీనియర్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని పోలీసులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని కోర్టు ఛాంబర్‌లో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దుకాణాల్లో, హోటళ్లలో, కిరాణ షాపుల్లో బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించడం అందరి బాధ్యత అన్నారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలన్న ప్రధాన సంకల్పంతో ఆపరేషన్ స్వేచ్ఛ నిర్వహించడం జరుగుతోందని చెప్పారు.

ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలి

జూపాడుబంగ్లా: గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకొని సుఖప్రసవం పొందాలని ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ సభా అన్నారు. మంగళవారం జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్(పీఎంఎస్‌ఎంఏ) పథకం కింద గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట

జూపాడుబంగ్లా: చెంచులు, గిరిజనులతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ సూర్జహాన్, సర్పంచ్ శ్యామలమ్మ తెలిపారు. గళవారం 80బన్నూరు గ్రామంలో చెంచుల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాలయ కల్పన, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వారి వివరాలు తెలియజేస్తే వెంటనే పథకాలు అందేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామలమ్మ, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఏపీఎం అంబమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాల నమోదుకు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఏఓ షేక్షావలి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో వ్యవసాయాధికారులు ఈకేవైసీ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేవనూరు వెళ్లి పింఛన్ అందజేత



తల్లీకుమారులకు పింఛన్ ఇస్తున్న వలంటీర్

మహానంది: మహానంది గ్రామానికి చెందిన గుబ్బి లలితమ్మ, ఆమె కుమారుడు దివ్యాంగుడు గొబ్బి శ్రీకాంత్ అనారోగ్యం రీత్యా వైద్యం కోసం రేవనూరు వెళ్లారు. విషయం తెలుసుకున్న మహానంది గ్రామ వలంటీర్ సాంబశివరావు, గ్రామ సర్పంచ్ చలంచలం శిరీష భర్త తిరుపతయ్య మంగళవారం రేవనూరు వెళ్లి పింఛను అందజేశారు. ఈ మేరకు తల్లీకుమారులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు భూమిపూజ

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు గ్రామంలో బుధవారం నంద్యాల పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిలు రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను భూమిపూజ చేసి ప్రారంభిస్తారని మండల అధ్యక్షుడు చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలను ప్రారంభిస్తారన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కొత్తపల్లి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు సంసిద్ధులు కావాలన్నారు. మండలంలో 37 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. నెల 22 వతేదిన మండల కొత్త ఓటరు జాబిత వస్తుందని దానిని పరిశీలించి తప్పులు ఏమైన ఉంటే సవరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సౌకర్యాలు మెరుగుబడి

- మనబడి నాడు–నేడుతో మారిన మాధవరం స్కూల్ రూపురేఖలు
- కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు
- ప్రైవేటు స్కూల్ మానేసి పాఠశాలలో చేరుతున్న విద్యార్థులు
- రెట్టింపు స్థాయిలో పెరిగిన విద్యార్థుల సంఖ్య



వెలుగోడు: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉండి.. ఎప్పుడు కూలిపోతాయో అనే దయనీయ పరిస్థితుల నుంచి బయటపడి నేడు సకల వసతులతో కళకళలాడుతోంది. కార్పొరేట్ సంస్థలను తలదన్నేలా సర్కార్ స్కూల్ చక్కటి వాతావరణాన్ని సంతరించుకుంది. గతంలో ఆరుబయట కూర్చొని చదువుకునే విద్యార్థులు నేడు దర్జాగా క్లాస్ రూమ్‌లో బెంచీలపై కూర్చొని డిజిటల్ క్లాసులు వింటున్నారు. ఈ మార్పంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న 'మనబడి నాడు–నేడు' ఫలితమే.

మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా..

సుదీర్ఘ పాదయాత్రలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని స్వయంగా పరిశీలించిన వైఎస్ జగన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న అగచాట్లను గుర్తించారు. కనీస సదుపాయాలు కరువై విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడాన్ని చూసి చలించారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేలా ×మనబడి నాడు–నేడు€ కార్యక్రమాన్ని అమలు చేశారు.

రూ.19 లక్షలతో సౌకర్యాలు..

మండల పరిధిలోని మాధవరం ప్రాథమికోన్నత పాఠశాల మొదటి దశ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. గతంలో నాలుగు గదులు ఉండే ఈ పాఠశాలను సుమారు రూ. 19 లక్షలతో ఆరు గదులు నిర్మించారు. నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, మంచి నీటి సదుపాయం, మేజర్, మైనర్ మరమ్మతులు, విద్యుత్ సదుపాయం–లైట్లు, ఫ్యాన్లు, డెస్కులు, బెంచీలు, కుర్చీలు, బీరువాలు, టేబుళ్ల లాంటి ఫర్నిచర్, గ్రీన్‌చాక్‌బోర్డులు, పాఠశాల మొత్తానికి పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్స్, కాంపౌండ్ వాల్స్ ఏర్పాటు చేశారు. తొలుత 9 రకాల సదుపాయాల కల్పనకే ప్రణాళికలు రూపొందించినా తదుపరి కిచెన్ షెడ్లు, అదనపు తరగతి గదులు, డిజిటల్ తరగతులు కూడా జోడించారు. గతంలో 1 నుంచి 7వ తరగతి వరకు 65 మంది విద్యార్థులు మాత్రమే ఈ స్కూల్‌లో చదివేవారు. ప్రస్తుతం 120 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ఎంత మార్పు జరిగిందో అర్థం చేసుకోవచ్చు.



నాడు : మాధవరం స్కూల్



నాడు : అధ్వానంగా వంటగది



నేడు : రూపుదిద్దుకున్న భవనం



నేడు : నూతనంగా నిర్మించిన వంటగది

నాడు అధ్వానం.. నేడు సర్వాంగసుందరం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గది గోడ కూలిపోయి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. చుట్టూ పంట పొలాలు ఉండటంతో విషసర్పాలు వచ్చేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మన బడి నాడు– నేడు పనులతో పాఠశాల రూపు రేఖలు మారిపోయాయి. పాఠశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

రూపురేఖలు మారిన పాఠశాలలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పాఠశాలలోని తరగతి గదులు, టాయిలెట్స్, ఆధునీకరించబడ్డాయి. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా రంగురంగుల బొమ్మలతో టేబుళ్ల , బెంచీలతో తరగతి గదులు అలరిస్తున్నాయి. అన్ని తరగతి గదుల్లో డిజిటల్‌క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేశారు. ఆటస్థలాలు బాగుపడ్డాయి. శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని నాలుగు ప్రాథమిక పాఠశాలలు, గిరిజన గురుకుల ప్రతిభాపాఠశాల , గిరిజన గురుకుల బాలుర పాఠశాల ,మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో రూ.2.91 కోట్లను ఖర్చు చేసి పాఠశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్దారు.



నాడు మద్దూరు స్కూలులో కూలిపోయిన తరగతి గోడ



నేడు స్కూలు భవన సముదాయం



నాడు శ్రీశైలం బీసీ గురుకుల పాఠశాలలో పాడైన మూత్రశాలలు



నేడు మెరుగైన మూత్రశాలలు

నాడు ఆరుబయటే చదువు

మా ఊరిలో స్కూల్‌లో గతంలో పాత గదులు ఉండేవి. వర్షం వస్తే కారేవి. పిల్లలను ఆరుబయట కూర్చోబెట్టి చదువులు చెప్పేవారు. ఇప్పుడు ఆ అవస్థలు లేవు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ నాడు–నేడుతో కొత్త భవనాలు నిర్మించడం, అన్ని సదుపాయాలు కల్పించడంతో విద్యార్థులు చక్కగాచదువుకుంటున్నారు.

–విజయకుమార్ చౌదరి, చైర్మన్, తల్లిదండ్రుల కమిటీ,

“ప్రైవేట్ బడి మాన్పించాం..



నా కుమారుడు మహేష్ 6వ తరగతి చదువుతున్నాడు. గతంలో రోజు వెలుగోడు పట్టణంలోని ప్రైవేట్ బడికి పంపించేవాళ్లం. ఊర్లోనే స్కూల్‌ను చక్కగా తీర్చిదిద్ది, ఇక్కడే అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చారు. దీంతో మా కొడుకును ప్రైవేట్ బడి మాన్పించి ఊర్లో ప్రభుత్వ బడికి పంపిస్తున్నాం. భారీగా డబ్బులు వెచ్చించి ప్రైవేట్ స్కూల్లో చదివించాల్సిన అవస్థలు తొలగిపోయాయి. మాలాంటి పేద వర్గాలకు పెనుభారం తప్పింది. పక్కా భవనాలతో పాటు వివిధ సదుపాయాలను కల్పించడంతో పిల్లలు ఉత్సాహంగా బడికి వెళ్తున్నారు.

–వెంకటేశ్వరమ్మ, విద్యార్థి తల్లి , మాధవరం

విద్యార్థుల సంఖ్య రెట్టింపు



నాడు–నేడు మొదటి విడతలో మా పాఠశాలను ఆధునికీకరించాం. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ పనులు విజయవంతంగా పూర్తి చేసేలా అధికారులు, గ్రామస్తులు సహకరించారు. పాఠశాల చుట్టూ మొక్కలు నాటారు. పాఠశాలతో పాటు టీచర్ల ప్రతిష్ట పెరిగింది. చిరస్థాయిగా ఉండేలా అభివృద్ధి చేశాం. గతంలో 65 మంది విద్యార్థులు ఉండేవారు..ఇప్పుడు 120 మంది బడికి వస్తున్నారు. ఇది గొప్ప మార్పు.

–జయరాం, హెచ్‌ఎం, మాధవరం స్కూల్

“స్కూలును చూస్తే ప్రభుత్వ బడేనా అనిపిస్తుంది



స్కూలును చూస్తుంటే ఇప్పుడు ప్రభుత్వ బడేనా అనిపిస్తుంది. గతంలో స్కూలు గోడ కూలిపోయి ఉండేది. ఎప్పుడు ఏమి జరుగుతదో అర్థం కాని పరిస్థితి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. స్కూలును చూస్తుంటే కార్పొరేట్ స్కూలును చూస్తున్నట్టుంది. మన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినా మజాకా అన్నట్లుంది.

– రామ్ కోటి నాయక్, క్రిష్టానగర్, మద్దూరు.

కలియుగ దానకర్ణుడు జవ్వాజి సుంకన్నగౌడు



సుంకన్నగౌడు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

నందికొట్కూరు: కలియుగ దానకర్ణుడు జవ్వాజి సుంకన్నగౌడు సేవలను మరవకూడదని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పరిధిలో, పటేల్ సెంటర్‌లో జవ్వాజి సుంకన్నగౌడు జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో సుమారు 40 ఎకరాలు ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు అందించిన మహానుభావుడు జవ్వాజి సుంకన్నగౌడు అని కొనియాడారు. కౌన్సిలర్లు చాంద్‌బాషా, హమీద్, వైఎస్సార్‌సీపీ నాయకులు అబుబక్కర్, ఆర్ట్ శ్రీను, జవ్వాజి సుంకన్నగౌడు సేవా సమితి సభ్యులు వీరకుమార్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర.. ప్రగతి పాలనకు పునాది



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

వెలుగోడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ద్వారా సంక్షేమ, ప్రగతి పాలనకు పునాదులు పడ్డాయని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజాసంకల్పా యాత్ర ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలోని పొట్టిశ్రీరాములు సెంటర్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత 99 శాతం నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో బళ్లాని వెంకట సత్యనారాయణ, సర్పంచ్ వేల్పుల జయపాల్, అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఇలియాస్ ఖాన్, బోగోలు శివశంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలయాత్ర గ్రంథం ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ, రచయిత

శ్రీశైలంటెంపుల్: ఏపీ మెడికల్ అరోమ్యాటిక్ ప్లాంట్ బోర్డు సీఈఓ కొమ్మంటి అశోక్ కుమార్ రచించిన శ్రీశైలయాత్ర కన్నడ గ్రంథాన్ని మంగళవారం శ్రీశైల మహాక్షేత్రంలోని పరిపాలనా భవన కార్యాలయంలోని సమావేశ మందిరంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఈఓ డి. పెద్దిరాజు ఆవిష్కరించారు. నాగలూటి నుంచి శ్రీశైలానికి నడకదారిలో వచ్చే భక్తులకు తగు మార్గదర్శకంగా వీరు ఈ శ్రీశైలయాత్ర గ్రంథాన్ని రచించారు. 2008 సంవత్సరంలో ఈయన తెలుగులో రచించిన శ్రీశైలగ్రంథానికి అనువాదంగా ప్రస్తుత కన్నడ గ్రంథం వెలువడింది.

సమగ్ర భూ రీసర్వేతో భూసమస్యలకు చెక్

జూపాడుబంగ్లా: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీసర్వేతో వందేళ్లనాటి భూసమస్యలు సమసిపోనున్నాయని డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, మండల సర్వేయర్ షహనా పర్వీన్ అన్నారు. మంగళవారం మండలంలోని పి.లింగాపురం గ్రామంలో సర్పంచ్ నాగార్జునరెడ్డి అధ్యక్షతన సమగ్ర భూ రీసర్వే పై రైతులతో సమావేశం నిర్వహించారు. వీఆర్వో జబీవుల్లా, విలేజ్ సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపల్ రఘురామాచార్యులు తెలిపారు.

నందికొట్కూరు: స్థానిక స్కాలర్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల హరిదాసు, రైతులు, అష్టలక్ష్ములుగా వేషధారణ, రంగు, రంగుల ముగ్గుల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ కాటూరి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

వెలుగోడు: మినుము పంటలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ పవన్‌కుమార్ తెలిపారు. మోతుకూరు గ్రామంలో సాగుచేసిన మినుము పైరును మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మినుము పంటలో ఆశించే పురుగులలో ముఖ్యంగా తెల్లదోమ, పంటకు అపారమైన నష్టాన్ని కలుగజేస్తుందన్నారు. నివారణకు ట్రైజోఫాస్ 20 మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాముల లేదా మోనోక్రోటాఫాస్ 0.6 మి.లీలు ఒక లీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



చైర్మన్ కళావతికి మెమొంటో అందిస్తున్న ఈఓ

మహానంది: ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ కళావతి, కమిటీ సభ్యులు మంగళవారం రాత్రి శ్రీ మహానందీశ్వర స్వామి, శ్రీ కామేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు. కర్ణాటక రాజ్యసభ సభ్యుడు, ఎంపీ ఈరన్న కలాడి నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం మహానంది వచ్చారు. శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

సంతకాల సేకరణ

శ్రీశైలంప్రాజెక్ట్: విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మద్దతుగా సున్నిపెంట గ్రామ సచివాలయం – 2 లో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లుతో పంచాయతీ కార్యదర్శి బాలునాయక్ సామాజిక న్యాయం కార్యక్రమం నిర్వహించారు.

నందికొట్కూరు: స్థానిక 3వ వార్డు సచివాలయంలో కౌన్సిలర్ మంగళి కృష్ణ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి, శిల్పా భువనేశ్వరరెడ్డి
- అట్టహాసంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం
- పట్టణంలో భారీ బైకు ర్యాలీ

సీఎం జగనన్న స్ఫూర్తితో కేపీఎల్



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నారి, ఆయన స్ఫూర్తితో తాము కూడా శ్రీశైలం నియోజకవర్గంలో కేపీఎల్ (కార్తీక్ రెడ్డి ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పాకార్తీక్‌రెడ్డి, శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. శిల్పా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలోని క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ లాంటి క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. తాము వ్యాపారాలు చేస్తూ వచ్చిన సంపాదనలో రాజకీయాలకు అతీతంగా సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి ప్రాధాన్యత ప్రజలకు సేవ చేయడమేని ఆ తరువాతే రాజకీయాలు చూస్తామన్నారు. టోర్నమెంట్‌లో 205 జట్లుపాల్గొంటున్నాయని చెప్పారు. అన్ని జట్లుకు క్రికెట్‌కిట్లను అందజేశామన్నారు. టోర్నీ ముగిశాక కిట్లను క్రీడాకారులే ఉపయోగించుకోవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, రజాక్, అంబాల ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహేశ్వరరెడ్డి, దేశం తిరుపం రెడ్డి, శివశంకర్‌నాయుడు, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, పుల్లారెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, పువ్వాడ భాస్కర్, విజయచౌదరి తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్‌ర్యాలీ

వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం నుంచి శిల్పా భువనేశ్వరెడ్డి ర్యాలీని ప్రారంభించారు. పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, గౌడ్‌సెంటర్, కప్పలకుంట్ల, పాతబస్టాండ్ మీదుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ర్యాలీ చేరుకుంది. అంతకుమునుపు నంద్యాల టర్నింగ్ వద్ద దివంగత నేత వైఎస్సార్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆత్మకూరుకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక్‌రెడ్డి ప్రీమియర్ లీగ్(కేపీఎల్)కు మద్దతుగా వెలుగోడు మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించగా దాదాపు 200 బైకుల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆత్మకూరుకు తరలి వెళ్లారు. సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, వైఎస్‌ఆర్ వైద్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నాగశేషులు, నాయకులు షంషీర్ అలీ, తెలుగు రమణ, టైలర్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి 'ఆడుదాం..ఆంధ్ర'

నందికొట్కూరు: ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మండల స్థాయి ఆడుదాం..ఆంధ్ర పోటీలు నిర్వహిస్తునట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రికెట్, కబడ్డీ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో, షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో, వాలీబాల్, ఖో, ఖో బిజినవేముల జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్ మైదానంలో నిర్వహిస్తునట్లు చెప్పారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు సర్పంచు శోభలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి మంగళవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. అందులో భాగంగా టీ షర్టులు, బ్యాట్లు, వాలీబాల్, ఇతర క్రీడల సామగ్రిని అందిచారు.

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామం సచివాలయం వద్ద గ్రామీణ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు సర్పంచు వరప్రసాద్ చేతుల మీదుగా క్రీడా దుస్తులు, టోపీలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు పుల్లయ్య, కళ్యాణ్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: తర్తూరు గ్రామ సచివాలయం వద్ద గ్రామ స్థాయి ఆడుదాం–ఆంధ్ర క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి టీషర్టులు, టోపీలు అందజేశారు. అలాగే విజయవాడలో ఏర్పాటుచేయనున్న అంబేడ్కర్ సామాజిక న్యాయశిల్పం కోసం సంతకాల సేకరణను ప్రారంభించారు.

ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం



ఎదురుపాడులో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి

కొత్తపల్లి: ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోకవరం పీహెచ్‌సీ పరిధిలోని ఎదురుపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును డాక్టర్ విజయేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో 370 మందికి వైద్యసేవలు అందించారు. క్యాంపు నిర్వహిస్తున్న సమయంలోనే ఓ బాలికకు కుక్క కరవడంతో స్పందించిన వైద్య సిబ్బంది అక్కడ ప్రథమ చికిత్స అందించి వైద్యశాలకు తరలించి టీకా వేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జూబేద, జబీర్, కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అన్నారు. మంగళవారం మండలంలోని మద్దూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీక్రిష్ణ, డాక్టర్లు రాజశేఖర్, పూర్ణేశ్వర్, గులాబ్‌షా పాల్గొన్నారు.

మిడుతూరు: మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ మరియమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీడీఓ జీఎస్‌ఎస్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ మద్దిలేటి, డాక్టర్ శారద, ఉపసర్పంచ్ పేరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగనన్న



నెహ్రూనగర్‌లో సర్పంచ్ రాజేశ్వరికి (బీజేపీ) మంజూరైన వితంతు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ఏ రాష్ట్రంలో ఇవ్వనంత పింఛన్ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని అవ్వాతాత, అక్కాచెల్లెమ్మలకు ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తర్తూరు గ్రామసచివాలయంలో గ్రామానికి నూతనంగా మంజూరైన నాలుగు పింఛన్లతో పాటు పెంచిన పింఛన్ నగదు రూ.3వేలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

పగిడ్యాల: నెహ్రూనగర్ గ్రామ సచివాలయం –1 వద్ద నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పులేంద్రనాయుడు ముఖ్య అతిథిగా హాజరై 16 మందికి కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన బీజేపీ కార్యకర్త తిక్కస్వామి భార్య సర్పంచ్ రాజేశ్వరికి వితంతు పింఛన్ మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.